క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని పట్టణ ఏఈ నాగిరెడ్డి అన్నారు. బైపాస్ లైన్‌లో అత్యవసర పనుల నిమిత్తం శని వారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొండమోడు నుంచి వచ్చే 11 కేవీ ఆర్ ఆర్ ఫీడర్, ఎస్సార్ ఫీడర్, మహవీర్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి



దాచేపల్లి : ఓపెన్ ఇంటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ విద్య రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎన్.అక్బర్ అలీ అన్నారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి ఓపెన్ ఇంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. పదవ తరగతి పాసై ఖాళీగా ఉన్న, పై చదువుల కోసం ఏ కళాశాలలో చేరకుండా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. బడి బయట ఉన్న విద్యార్థులను ఓపెన్ ఇంటర్‌లో చేర్పించి అడ్మిషన్ శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్‌బాబు, జిల్లా కో ఆర్డినేటర్ హుస్సేన్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటోలు నడిపితే కఠిన చర్యలు

సీఐ ప్రభాకర్‌రావు



వెల్దుర్తి: మద్యం తాగి ఆటోలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల పట్టణ సీఐ ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం మాచర్ల పట్టణంలోని టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి ఆటో నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు. పాదచారులు రోడ్డు దాటే టప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో ఆటోలు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

దూరవిద్యకు దరఖాస్తు చేసుకోండి

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆసక్తి కలిగిన విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ దూరవిద్యకు దరఖాస్తు చేసుకోవాలని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం లింగాల ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దూర విద్య గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. హెచ్ఎం మాట్లాడుతూ పదవ తరగతికి 14 సంవత్సరాలు, ఇంటర్‌కు 15 సంవత్సరాలు వయస్సు ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వ తేదీ ఆఖరు అని తెలిపారు. వివరాలకు పాఠశాలను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి



పిడుగురాళ్లరూరల్: పిల్లలు, వృద్ధులు బలహీనమైన వారిలో వైరల్ ఫీవర్ త్వరగా వ్యాపిస్తుందని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ అన్నారు. మండలంలోని వీరాపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో ర్యాపిడ్ రెస్పాన్సిబుల్ టీమ్ ఆధ్వర్యంలో గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్ల మంట, అధిక వేడి, తలనొప్పి, కండరాల నొప్పులు, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉన్న వెంటనే డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. నీటిని నిల్వ ఉంచకూడదని, నీరు పారే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంట్లో కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పనికిరాని టైర్లు ఉంచకూడదని, వాటిల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది, వైరల్ ఫీవర్లు వస్తాయని, వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కల్లాం, డాక్టర్‌లు ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డి, సూపర్‌వైజర్ ప్రభాకర్, సురేశ్, జయపాల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాల్లో మార్పులు తీసుకురావాలి



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎన్ని చట్టాలు తీసుకువచ్చిన మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం అందరినీ కలచివేసింది. చిన్నారులపై లైంగిక దాడులు, మహిళలపై అఘాయిత్యాలు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. వైద్య వృత్తి చేసే వారికి భద్రత పెంచే విధంగా చర్యలు చేపట్టాలి.

– బండి జయలక్ష్మి, నర్సు, సామాజిక ఆరోగ్య కేంద్రం, గురజాల



వైద్యులపై దాడులు దుర్మార్గం



ప్రాణాలను కాపాడే వైద్యులపై అఘాయిత్యాలకు పాల్పడటం దుర్మార్గం. కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలిపై అఘాయిత్యం చేసి దారుణంగా చంపటం హేయం. సాక్ష్యాలను మార్చి నిందితులను కాపాడేందుకు.. పెద్ద వాళ్ల హస్తం ఉండే అవకాశం ఉంది. ప్రాణాలను కాపాడే డాక్టర్లపై ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎంతటి పెద్దవారైనా కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పల్నాడు హాస్పిటల్ వైద్యులు, పిడుగురాళ్ల

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభలు

రెంటచింతల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఏ ఏ పనులు చేపట్టాలో ఆయా గ్రామస్తులతో చర్చించి తీర్మానాలు చేయడానికి ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యల్లా మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని గోలి, పశర్లపాడు, పాలువాయి, రెంటచింతల గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో సీసీ రోడ్లు, పీఆర్ పనులు, డ్రైన్స్, మేజర్, మైనర్ కెనాల్స్ అభివృద్ధి పనులు, పండ్ల తోటల పెంపకం, కల్వర్టుల పనులు, మినీ గోకులాల నిర్మాణం, ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వల్లో పూడిక తీత పనులు, కొత్త పనులు గుర్తించడం వంటివి ఈ గ్రామ సభలలో గ్రామస్తులతో చర్చించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో గ్రామస్తులను భాగస్వాములను చేయడానికే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 11 గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏవో బి.బ్రహ్మారెడ్డి, ఎంఈవో–2 వై. శివనాగేశ్వరరావు, సర్పంచ్‌లు షేక్ హసాన్, మున్నా చంద్రం, మండలపు విజయలక్ష్మి, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఉపాధి హామీ గ్రామ సభలు

దాచేపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను మండల వ్యాప్తంగా శుక్రవారం జరిపారు. పొందుగల, తంగెడ, గామాలపాడు, కేసానుపల్లి, ముత్యాలంపాడు, రామాపురం, శ్రీనగర్‌లలో జరిగిన గ్రామ సభల్లో తహసీల్దార్ వైవీ. కుటుంబరావు, ఎంపీడీవో శోభారాణి, ఏపీవో మల్లిఖార్జునరావు పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. సభ దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన పనుల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. గ్రామాల్లో గుర్తించిన పనులు చేసేందుకు కావాల్సిన నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఏపీవో మల్లిఖార్జునరావు, తహసీల్దార్ కుటుంబరావు చెప్పారు.



గోలి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో యల్లా మహాలక్ష్మి



జమ్మలమడక గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియా ఉల్ హక్

గ్రామాభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలి

మాచర్ల రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జమ్మలమడక గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామాలకు గొప్ప వరమని, దీని ద్వారా గ్రామంలో కావాల్సిన రోడ్లు, కాల్వలతో పాటు ఇతర అవసరాల భవనాలను నిర్మించుకునేందుకు దోహదపడుతుందని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 100 రోజుల పనిని అందిస్తున్నామని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పర్చుకొని గ్రామాభివృద్ధికి దోహదపడాలన్నారు. ఏయే పనులు ఉన్నాయో ప్రజలు అధికారులకు వివరిస్తే వాటికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, వీఆర్ఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులున్నారు.



తంగెడ గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో మల్లిఖార్జునరావు

గ్రామాల అభివృద్ధికే గ్రామ సభలు

వెల్దుర్తి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఏడీఏ జగదీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలు అత్యంత కీలకమన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు తయారు చేసి అమలు పరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 2024–25 సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన పనుల గుర్తింపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించామన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీదేవి, ఏవో ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధి దిశగా పయనించాలి

పిడుగురాళ్లరూరల్: గ్రామాలు అభివృద్ధి దిశగా పయనించాలని ఎంపీపీ గార్లపాటి అనసూర్య, వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు, పందిటివారిపాలెం, కోనంకి, గుత్తికొండ, కామేపల్లి, గుత్తికొండ, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కావాల్సిన పనులకు ఎస్టిమేట్లు తయారు చేసి గ్రామ సభలలో వెల్లడించి, గ్రామ పంచాయతీ తీర్మానం పొంది పరిచారు. అనంతరం తీర్మానాన్ని మండల పరిషత్‌కు పంపిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, తహసీల్దార్ మధుబాబు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పొందుగలలో గ్రామ సభ నిర్వహిస్తున్న తహసీల్దార్ కుటుంబరావు



ఉప్పలపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు



జూలకల్లు గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

టంగుటూరి ప్రకాశం జీవితం ఆదర్శనీయం



రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని బీజేపీ సీనియర్ నాయకులు సూరపరెడ్డి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్ర రాజకీయాల్లో ఒక ధృవతారగా వెలుగొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాదె లూర్దు మర్రెడ్డి, కోటయ్య, షేక్ వలి తదితరులున్నారు.

విధులకు న్యాయవాదులు గైర్హాజరు

గురజాల : జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా శుక్రవారం న్యాయవాదులు విధులకు గైర్హాజర్ అయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉపాధ్యక్షుడు బండి వీరభద్రుడు, న్యాయవాదులు రామిరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, బి.హనుమంతరావు, జక్కా చెన్నకేశవరావు, కత్తి చలమరాజు, కేవీ నాగార్జున తదితరులున్నారు.

మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా పోలూరి

వెల్దుర్తి: మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా పోలూరి నరసింహారావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నరసింహారావు గురువారం వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి రాజీనామా చేసి, శుక్రవారం టీడీపీలో చేరి మున్సిపల్ చైర్మన్ బాధ్యతలను స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న తురకా కిషోర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటంతో వైస్ చైర్మన్‌గా ఉన్న మాచర్ల చిన ఏసోబు చైర్మన్ బాధ్యతలను చేపట్టారు. ఇటీవల మాచర్ల చిన ఏసోబు ఆయన పదవికి రాజీనామా చేయటంతో వైస్ చైర్మన్‌గా ఉన్న నరసింహారావును మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. దీంతో ఆయన చైర్మన్ బాధ్యతలను స్వీకరించారు. చైర్మన్‌గా ఎన్నికైన పోలూరి నరసింహారావును మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే జేబీఆర్ మాట్లాడుతూ మాచర్ల పురపాలక సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన కౌన్సిలర్లందరూ పురపాలక సంఘ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహారావుకు పలువురు ఆర్యవైశ్య నాయకులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.



మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కొనసాగుతున్న వైద్య శిబిరం



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పిడుగురాళ్ల: జగ్జీవన్‌రామ్ కాలనీలో వైద్య శిబిరం శుక్రవారం కూడా కొనసాగింది. సాక్షిలో వచ్చిన కథనం మేరకు వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు గత రెండు రోజుల నుంచి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. పంచాయతీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పారే విధంగా చూడటం, బ్లీచింగ్ చల్లించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలు ఎవరికి సోకాయో, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో వివరాలను నమోదు చేస్తున్నారు. వైద్యాధికారులు ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సమస్య వస్తే వెంటనే తమకు తెలియజేయాలని వైద్యులు ప్రజలకు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యం

మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రెంటచింతల: నివాస పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించడం జరుగుతుందని దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించటం, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలను డెంగీ లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు ప్రమీల, విజయలక్ష్మి, ఆషా శిరీషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

లక్ష గాజుల అలంకరణలో వాసవాంబ

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పాత మాచర్లలోని ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య ఆలయ కమిటీ అధ్యక్షులు ఆత్మకూరి పూర్ణచంద్రరావు, ఆర్యవైశ్య మహిళలు మేడా వెంకటలక్ష్మిల ఆధ్వర్యంలో లక్ష గాజుల అలంకరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రావణమాసంలో లక్షగాజులతో అమ్మవారిని, ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించటం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మదవార్లు



పిడుగురాళ్ల: పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని భవాని నగర్‌లో వెంచేసియున్న కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వలంటీర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెంటచింతల: వలంటీర్ల ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన వలంటీర్లు శుక్రవారం ఎంపీడీవో యల్లా మహాలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వలంటీర్లకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు పరచి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.10 వేలు చెల్లించి ఆదుకోవాలని, వెంటనే విధులలోకి తీసుకోవాలని, జాబ్ చార్టు ప్రకటించాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండాటి రాజు, ఎస్‌కే బాజి, వెన్నా అవినాష్ రెడ్డి, బోనం మర్రెడ్డి తదితరులున్నారు.

లింగాకర్షక బుట్టలు వాడండి



వెల్దుర్తి: గులాబి రంగు పురుగులను అరికట్టేందుకు రైతులు తమ పొలాల్లో లింగాకర్షక బుట్టలను వాడాలని ఏడీఏ జగదీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం శిరిగిరిపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ఆసిస్టు ఎల్‌డీసీ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలన్నారు. పత్తి పంటలో సోకే గులాబి పురుగులను నిర్మూలించటానికి లింగాకర్షక బుట్టలు ఎకరానికి 8 వాడాలన్నారు. ఆసిస్టు సంస్థ పల్నాడు ప్రాంతంలో గిరిజన తండాలలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఎల్‌డీసీ సంస్థ ద్వారా లింగాకర్షక బుట్టలను ఉచితంగా 150 మంది రైతులకు అందించటం సంతోషమన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, సీనియర్ నాయకులు రామాంజనేయరెడ్డి, ఉపేంద్రరెడ్డి, ట్రైనీ మేనేజర్ సంతోష్, ఆసిస్టు డిప్యూటీ డైరెక్టర్ రవిబాబు, ఎల్‌డీసీ ప్రతినిధులు రామనారాయణ, వీహెచ్ఏ శ్రావణ్‌నాయక్, వీఏఏ గోపి, రైతులు పాల్గొన్నారు.

ఊరి బాగులో అందరు భాగస్వాములు కావాలి



కారెంపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారెంపూడి: మన గ్రామాలను మనమే అభివృద్ధి చేసుకుందామని, ఊరి బాగులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన కారెంపూడి గ్రామ సభలో ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించిన పనులను చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో పాటు శ్మశానాలను బాగు చేసుకోవడం, నీటి వనరులు అభివృద్ధి చేసుకోవడం అలాగే ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టదగిన అన్ని పనులు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి గ్రామ సభను నిర్వహించారు. కారెంపూడి గ్రామ పంచాయతీకి రూ.30 లక్షలు మంజూరయ్యాయని, 8 సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు జరిగాయి. గ్రామ సభల్లో గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి జాబితాలను గ్రామ కార్యదర్శులు తయారు చేస్తున్నారు. ఎక్కువగా సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు కోరుతూ గ్రామ సభల్లో ప్రజలు అర్జీలు సమర్పించారు. అన్ని చోట్ల పంచాయతీ సర్పంచ్‌లు వార్డు మెంబర్లు పాల్గొన్నారు. చినకొదమగుండ్ల, చినగార్లపాడు, గాదెవారిపల్లె, పేటసన్నెగండ్ల, చింతపల్లి, పెదకొదమగుండ్ల, లక్ష్మీపురం, మిరియాల గ్రామాలలో సర్పంచ్‌లు గ్రామ సభల్లో పాల్గొన్నారు. మిగిలిన చోట కాబోయే సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు ఎక్కువగా కన్పించారు. గ్రామ సభలకు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. తమ వీధిలో, వార్డుల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు.



పెదకొదమగుండ్లలో నిర్వహిస్తున్న గ్రామ సభ

ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: అనకాపల్లి జిల్లా ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రెండు రోజుల క్రితం రియాక్టర్ పేలి 18 మంది చనిపోవడానికి, 40 మంది కార్మికులు గాయాల పాలు కావడానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని రిజిస్టర్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఫార్మా కంపెనీలో సెఫ్టీ మెథడ్స్ లేకపోవడం వలన ఈ ప్రమాదం జరిగిందని, నిర్లక్ష్యం వహించిన యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే కేసులు పెట్టాలని, చనిపోయిన, గాయాలపాలైన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సున్నం మిల్లు కార్మికులు కాకర్ల సాంబయ్య, రావుల రామారావు, పెద్దిశెట్టి వెంకటేశ్వర్లు, భాస్కరరావు, రాములు, కుర్రా లింగయ్య, పగడాల కొండలు, తెలగలనేని వెంకటేశ్వర్లు, అంకారావు, శ్రీను, వెంకటేశ్వర్లు ఉన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు